క్లుప్తంగా

పేపర్ మిల్లులో ఉద్రిక్తత

ప్రకాశం నగర్: పేపర్ మిల్లులో వరంపర 1, 2 చేపట్టిన నియామకాల్లో కార్మికులకు జీతాలు పెంచకుండా చేశారంటూ కొందరు కార్మికులు శుక్రవారం రాత్రి కార్మిక నాయకుడు ప్రవీణ్ చౌదరిని మిల్లు ఆవరణలో నిలదీశారు. ఒక దశలో అతడిపై దాడి చేసేందుకు ప్రయత్నం జరిగింది. దీంతో మిల్లు ఆవరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

పట్టపగలు వెంకట్రావుపై ఆరోపణలు సరికాదు


విశ్వేశ్వరరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రోటరీ మహా కాశేశ్వర ఆలయం మేనేజింగ్ ట్రస్టీ పట్టపగలు వెంకటరావుపై ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇన్నీసుపేటలోని అరుణ ప్యాలెస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా ఇన్నీసుపేట, కోటిలింగాలపేట కైలాస భూములు, రోటరీ మహాకాళేశ్వరాలయం నిర్వాహకుడు పట్టపగలు వెంకట్రావుపై వస్తున్న ఆరోపణలపై రోటరీ క్లబ్ ప్రతినిధులు ఎందుకు స్పందించి సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. ఆ ఆరోపణలపై వెంటనే రోటరీ క్లబ్ ప్రతినిధులు కమిటీ వేసి నిజాలు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. శ్మశాన వాటికలు, మహా కాళేశ్వరాలయం ప్రతిష్ఠ దెబ్బతినేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నగరంలో అన్న క్యాంటీన్ల, దాతలు భోజనాలు పెట్టడం ద్వారా ప్రజలను సోమరిపోతులుగా మార్చుతున్నారని ఆరోపించారు. రిలయన్స్ ట్రెండ్ నుంచి విశ్వేశ్వర ఆలయం వరకూ వందలమంది బిచ్చగాళ్లకు రోజూ దాతలు భోజనాలు పెడుతున్నారన్నారు. వారిలో 90 శాతం మంది పనిచేయగలవారే ఉన్నారన్నారు. సమావేశంలో బి.అప్పారావు, వీరభద్రరావు, ఎ.అప్పారావు పాల్గొన్నారు.

30న జాబ్ మేళా


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు, అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జేకేసీ, వికాస ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఐసస్, ఎక్సాస్, టాటా, హ్యుందాయ్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో తరలి రావాలని, ఉదయ 10 నుంచి సాయంత్రం 4 వరకూ జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. అనంతరం జాబ్ మేళా పోస్టర్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆవిష్కరించారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: హాంకాంగ్ వారియర్స్
సూర్యప్యాలెస్	: ఐడెంటిటీ
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: సంక్రాంతికి వస్తున్నాం
అనుశ్రీ	: గేమ్‌ఛేంజర్
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: సంక్రాంతికి వస్తున్నాం
మేనక	: పుష్ప–2
రంభ	: స్కైషోర్స్
కుమారి	: పుష్ప–2
అప్సర	: డాకు మహారాజ్
అశోక	: డాకు మహారాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం

పరీక్షలకు వేళాయె..

- 27 నుంచి ఫార్మేటివ్ – 3 పరీక్షలు
- మండల కేంద్రానికి చేరిన ప్రశ్నపత్రాలు


ఫార్మేటివ్ పరీక్షల బండిల్స్‌ను స్టాక్ పాయింట్‌లో భద్రపరుస్తున్న విద్యాశాఖ అధికారులు

కంబాలచెరువు: ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ – 3 పరీక్షలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. సీబీఏ పూర్తి క్లాస్‌రూమ్ బేస్‌డ్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలానికి సంబంధించిన పరీక్ష బండిల్స్‌ను రాజమహేంద్రవరం కేంద్రంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్‌లో విద్యాశాఖాధికారులు భద్రపరిచారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో వారి పాఠశాలలకు సంబంధించిన ప్రశ్న పత్రాల బండిల్స్‌ను సరిచూసుకునే ప్రక్రియ పూర్తి చేశారు. వాటిని సబ్జెక్టుల వారీగా, తేదీల వారీగా ట్రంక్ పెట్టెల్లో ఉంచి, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

గంట ముందుగా..

ప్రశ్నపత్రాలను పరీక్ష సమయానికి ఒక గంట ముందుగా మాత్రమే ప్రధానోపాధ్యాయులకు ఇవ్వనున్నారు. ప్రధానోపాధ్యాయులు రాలేని పక్షంలో ఆ స్థానంలో మొదటి సహాయక ఉపాధ్యాయుడికి ఆథరైజేషన్ లెటర్ ఇచ్చి పంపితేనే అందిస్తారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఈ పరీక్షలు ప్రశాంతంగా, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఓఎంఆర్ షీట్ విధానంలో పరీక్షలు జరుగుతాయి.

నగరంలో పాఠశాలలు

రాజమహేంద్రవరంలో 50 మున్సిపల్ ప్రైమరీ స్కూళ్లు, 2 ప్రభుత్వ ప్రైమరీ స్కూళ్లు, ఒక ఎంపీపీ ప్రైమరీ, మూడు యూపీ మున్సిపల్ స్కూళ్లు, మూడు ఎయిడెడ్ ప్రైమరీ, రెండు యూపీ, 13 మున్సిపల్ హైస్కూళ్లు, 4 ప్రభుత్వ హైస్కూళ్లు, ఒక యూపీ, ప్రైవేట్ విభాగంలో 40 ప్రైమరీ స్కూల్స్, 35 అప్పర్ ప్రైమరీ స్కూళ్లు, 49 హైస్కూళ్లు కలిపి.. మొత్తం 203 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ఒకటి నుంచి పదో తరగతి పదో తరగతి చదువుతున్న 55 వేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, 11.15 నుంచి 12.15 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

అన్ని ఏర్పాట్లూ చేశాం

ఫార్మేటివ్ – 3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. ప్రధానోపాధ్యాయులందరికీ అవసరమైన అన్ని విధివిధానాలను వివరించాం. పరీక్ష పత్రాలను స్టాక్ పాయింట్‌లో భద్రపరిచాం. పరీక్షల ప్రారంభం రోజున వాటిని సబ్జెక్టుల వారీగా ప్రధానోపాధ్యాయులకు అందజేస్తాం. ఈ పరీక్షలపై కార్యాలయం అధికారులు, సిబ్బందికి సమీక్ష కూడా నిర్వహించాం.

– బి.దిలీప్ కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

పరీక్షల షెడ్యూల్

- 27 ఉదయం సంస్కృతం, రెండో సెషన్‌లో ఓరియంటల్ సంస్కృతం
- 28 ఉదయం తెలుగు, రెండో సెషన్‌లో మ్యాథ్స్
- 29 ఉదయం హిందీ, రెండో సెషన్‌లో జనరల్ సైన్స్
- 30 ఉదయం సోషల్ స్టడీస్, రెండో సెషన్‌లో ఇంగ్లిషు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

క్విజ్, వ్యాసరచన పోటీలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, చరిత్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం క్విజ్, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో దేశభక్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు సయ్యద్ ఫరా ఎష్రూన్, చరిత్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ బి.అంజనీ కుమారి ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీటిలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 26వ తేదీన బహుమతులు అందజేయనున్నారు.

ఆనం కళాకేంద్రంలో నేడు 'లోకల్ సెలబ్రిటీ షో'


సమావేశంలో మాట్లాడుతున్న హాస్యనటుడు డాక్టర్ భద్రం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): డాక్టర్ భద్రమ్స్ ఫిల్మ్ హౌస్ ఆధ్వర్యాన వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో శనివారం సాయంత్రం 5.30 గంటలకు లోకల్ సెలబ్రిటీ షో నిర్వహిస్తున్నట్లు హాస్య నటుడు డాక్టర్ భద్రం తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఇలాంటి షోలు నిర్వహిస్తామన్నారు. తొలిసారిగా కళాసాంస్కృతిక కేంద్రమైన రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నటులు, గాయకులు ఈషోకి వచ్చి ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు. సాధారణంగా సినిమాల్లో నటించాలంటే హైదరాబాద్ వెళ్లి, రూమ్ అద్దెకు తీసుకుని అన్ని ఆఫీసుల చుట్టూ తిరగాలన్నారు. అయినా సరే అవకాశం ఎప్పుడు వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ షోకి వచ్చిన వారి ఫొటోలు, వివరాలను హైదరాబాద్‌లో అందరికీ అందజేసి, పిలుపు వస్తే వెళ్లేలా చేస్తామన్నారు. సమావేశంలో గౌతమ్, శివ, ఫణి, సాయి, సన్నీ పాల్గొన్నారు.

ది బెస్ట్ నర్సరీ మన్‌గా మల్లు పోలరాజు


వాల్మీకి మహర్షి అవార్డు అందుకుంటున్న శివాంజనేయ నర్సరీ రైతు పోలరాజు

కడియం: స్థానిక శివాంజనేయ నర్సరీ అధినేత మల్లు పోలరాజుకు ది బెస్ట్ నర్సరీమన్ అవార్డు లభించింది. కర్ణాటక ప్రభుత్వం నిర్వహించిన ఫల పుష్ప ప్రదర్శనలో ఆయన ఏర్పాటు చేసిన స్టాల్ అందరినీ ఆకట్టుకుంది. దీంతో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ జగదీష్, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎస్.రమేష్ చేతుల మీదుగా పోలరాజును ఘనంగా సత్కరించారు.

వాల్మీకి మహర్షి అవార్డు

మైసూర్ హార్టికల్చర్ సొసైటీ ఆఫ్ కర్ణాటక నిర్వహించిన 217వ జాతీయ ఫల,పుష్ప ప్రదర్శన సందర్భంగా బెంగుళూరులోని లాల్‌బాగ్‌లో హార్టికల్చర్ బోర్డు ఆఫ్ కర్ణాటక.. వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేసింది. దానిలో భాగంగా లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్ పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సేవలందించినందుకు గాను సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు, శివాంజనేయ నర్సరీ రైతు మల్లు పోలరాజుకు ఆదికవి వాల్మీకి అవార్డు ప్రదానం చేశారు.

త్వరితగతిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: వెంకట్రామయ్యనగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని సత్వరమే పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. అలాగే ద్రవ వ్యర్థ పదార్థాల సీవేజీ ప్లాంట్ నిర్వహణ విషయంలో నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అన్నారు. ఆమె శుక్రవారం ఇండోర్ స్టేడియం, హుకుంపేట ఎస్‌టీపీ పనులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ అమృత్ పథకంలో హుకుంపేటలో నిర్మాణంలో ఉన్న 50.60 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ పనులు పూర్తి చేయాలన్నారు. నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.3 కోట్లతో వెంకటరామయ్య నగర్‌లో ప్రస్తుతమున్న షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఆవరణలో మైదానం, రెండు అంతస్తులుగా ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారన్నారు. దీనిలో చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికే 82 శాతం పనులు పూర్తయ్యాయని, అతి త్వరలోనే మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. హుకుంపేటలో ప్రస్తుతం ఉన్న 30 ఎంఎల్‌డీ సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనితీరును, లేబోరేటరీలో ట్రీట్ చేస్తున్న నీటిని పరిశీలించారు. ప్రస్తుతమున్న 30 ఎంఎల్‌డీ సీలేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు జనాభా అవసరాలకు సరిపోవటం లేదన్నారు. దీంతో అమృత్, జాతీయ నదీ పరివాహక పరిరక్షణ పథకంలో అదనంగా రూ.88.43 కోట్లతో ఎస్‌టీపీ నిర్మిస్తున్నామన్నారు. ఈ పనులు 50 శాతం పూర్తయ్యాయని, త్వరితగతిన మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్, జి.పాండురంగారావు, ఆర్ఎంసీ ఈఈ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం


ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

కంబాలచెరువు: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత కీలకమైనదని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీటిని పరిశీలించిన ఆర్డీవో మాట్లాడుతూ దేశంలో ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తారన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల నుంచి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు శుక్రవారం జిల్లా స్థాయి పోటీలు నిర్వహించామన్నారు. వీటికి దాదాపు వంద మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జిల్లా స్థాయి విజేతలకు శనివారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్, ఎస్‌కేవీటీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు నరసింహారావు, వరహాగిరి కృష్ణమోహన్, పుప్పాల బాపిరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ దుర్గానగర్, మల్లయ్యపేట, పేపర్ మిల్లు రోడ్డు, లూథర్ గిరి, శ్రీరామ్ నగర్, మున్సిపల్ కాలనీ, వాంబే గృహాలు, వడ్డీల పేట, పేపర్ మిల్లు గృహ సముదాయాలు, ఆనంద నగర్, గాడిరెడ్డి నగర్, వెంకటాపురం, రామదాసుపేట, సీసీ కాలనీ, టీచర్స్ కాలనీ ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరు , కోలమూరు, రాయుడు పాకలు, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో గ్రీన్ డ్రైవ్


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి తదితరులు

సీటీఆర్ఐ: పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మొక్కలు నాటాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది అందించిన మొక్కలను గ్రీన్ డ్రైవ్ పేరుతో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీ తదితర నగరాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయన్నారు. అటువంటి పరిస్థితి మన నగరానికి రాకుండా ఉండాలంటే విరివిగా మొక్కలను పెంచాలన్నారు. నేడు ఆధునీకరణ పేరుతో చెట్లను నరికి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేఎస్ రత్నకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు వీరలక్ష్మి, విజయలక్ష్మి, దేవి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఠాగూర్ జయంత్యుత్సవం


ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యానాపు ఏసు, సూర్యనారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు నాయీ బ్రాహ్మణ కాలనీలో మహాత్మా జ్యోతీరావు పూలే నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పెండ్యాల నాగబాబు, కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముంగండ సూర్యనారాయణ, పెండ్యాల నాగబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కర్పూరి ఠాకూర్ కులవృత్తి చేస్తూ బీహార్ ముఖ్యమంత్రిగా ఎదిగిన వైనం, ఆయన నిరాడంబర జీవితం, ప్రజలకు అమలు చేసిన పథకాలు , బీసీ కులాలకు కల్పించిన రిజర్వేషన్ల గురించి వివరించారు.

26 నుంచి యోగా శిక్షణ తరగతులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీలోని దుర్గా సెంటర్ సి బ్లాక్‌లో గల జక్కంపూడి రామ్మోహనరావు కల్యాణ మంటపంలో ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ యోగా శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజమండ్రి లయన్స్ క్లబ్ రూరల్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ యోగా మాస్టర్ తీడా రాము ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ శిక్షణ ఇవ్వనున్నారు. ఎనిమిదేళ్లు దాటిన వారందరూ వీటికి హాజరుకావచ్చన్నారు. వివరాలకు 93966 99099, 94913 86894 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


కడియంలో చిత్రలేఖనం పోటీ విజేతలతో హెచ్ఎం సత్యనారాయణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, వాటిని ప్రోత్సహించిన, చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయలక్ష్మి అన్నారు. పిడింగొయ్యి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం ఈ ఏడాది నినాదమైన 'చల్లని చందమామలా కాదు, మండే సూర్యుడిలా పెంచండి. చూడటానికి గానీ, తాకటానికి గానీ భయపడతారు' అని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు గోపాలకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త జీఎం ఎస్‌కే తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలు అన్నింటా ముందుండాలి

కడియం: ఆడపిల్లలు భయాన్ని విడిచిపెట్టి, అన్నింటా ముందుండాలని కడియం ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అన్నారు. ఆ స్కూల్లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ చదువుతోనే ఆడపిల్లల జీవితానికి వెలుగు వస్తుందన్నారు.అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఉపాధ్యాయురాలు సువర్ణవేణి మాట్లాడారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని వంగ హారిక ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

కడియపులంకలో..

కడియం: కడియపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకవల్లి, సూపర్ వైజర్ అభిషాలిమ్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, బాలికల అక్రమ రవాణా, ఇన్‌స్టాగామ్, ఫేస్ బుక్ పరిచయాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెచ్ఎం జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బండి నిలిపితే.. ఫైన్ బాదుడే..

- రైల్వే కోచ్ రెస్టారెంట్ వద్ద పరిస్థితి
- వాహనం పార్క్ చేస్తే తాళం వేస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది
- నో పార్కింగ్ జోన్ అంటూ జరిమానాలు
- వాహన చోదకుల ఆవేదన
- పోలీసుల వాహనాలకు మినహాయింపు



రైల్వే స్టేషన్ ఆవరణలోని రైల్వే కోచ్ రెస్టారెంట్



రెస్టారెంట్ ముందు పార్కింగ్ చేసిన వాహనాలకు ఆర్పీఎఫ్ సిబ్బంది వేసిన తాళాలు, పోలీస్ స్టిక్కరున్న వాహనాన్ని వదిలేసిన వైనం

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణలోని రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో సరదాగా టిఫిన్, భోజనం చేద్దామని, కాఫీ, టీ తాగుదామని వెళుతున్నారా.. మీ ద్విచక్ర వాహనాన్ని రెస్టారెంట్ ముందు పార్కు చేస్తున్నారా.. కొంచెం జాగ్రత్తగా ఉండండి. లేకపోతే రూ.500 పైబడి జరిమానా కట్టాల్సిందే. మరో ముఖ్య విషయం ఏమిటంటే ఈ జరిమానా సాధారణ ప్రజలకు మాత్రమే.. పోలీస్ స్టిక్కర్లు ఉన్న వాహనాలకు వర్తించవంట. శుక్రవారం జరిగిన ఈ ఘటనతో ఈ విషయం తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే.. కొందరు ప్రజలు శుక్రవారం రైల్వే కోచ్ రెస్టారెంట్‌లో అల్పాహారం తినటానికి వచ్చారు. ఆ రెస్టారెంట్ ఎదుట ద్విచక్ర వాహనాలను పార్కు చేసి లోపలకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి వారికి షాక్ తగిలింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది అక్కడ పార్కు చేసి ఉన్న ఐదు వాహనాల్లో నాలుగు సాధారణ వ్యక్తుల మోటారు సైకిళ్లకు తాళాలు వేశారు. వాటి మధ్య పోలీస్ అనే స్టిక్కర్ ఉన్న వాహనానికి మాత్రం తాళం వేయలేదు.

పార్కింగ్ స్థలం లేదు

ఎందుకు ఇలా చేస్తున్నారని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందిని ఆరా తీస్తే.. రైల్వే కోచ్ రెస్టారెంట్‌కు రైల్వే శాఖ ఏ విధమైన పార్కింగ్ ప్రదేశం ఇవ్వలేదని తెలిసింది. దీంతో ఆ రెస్టారెంటు ముందు వాహనాలను నిలిపితే జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు. అది నో పార్కింగ్ జోన్ కాబట్టి.. వాహనాలు నిలిపితే జరిమానా కట్టాలంటున్నారు. అలాగైతే నిబంధనలు అందరికీ ఒక్కటే కదా. మరి పోలీస్ స్టిక్కర్లు ఉన్న వాహనాలకు ఎందుకు మినహాయింపు ఇచ్చారనేది తేలని ప్రశ్న.

రైల్వే కోర్టులో జరిమానాలు

నో పార్కింగ్ జోన్‌లో నిలిపిన వాహన చోదకులపై కేసులు నమోదు చేసి రైల్వే కోర్టుకు తరలిస్తున్నారు. ప్రతి శుక్రవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రైల్వే కోర్టులో రాంగ్ పార్కింగ్ చేసిన వారందరినీ ప్రవేశపెట్టి జరిమానాలు విధిస్తున్నారు. ఈ విషయం తెలియని చాలా మంది కోచ్ రెస్టారెంట్‌కు వచ్చి జరిమానాల బారిన పడుతున్నారు. దీనిపై ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్యను వివరణ కోరగా.. రైల్వే కోచ్ రెస్టారెంట్‌కు రైల్వే శాఖ ఏవిధమైన పార్కింగ్ ప్రదేశం కేటాయించలేదన్నారు. స్టేషన్ ఆవరణలోని నో పార్కింగ్ జోన్‌లో మోటారు సైకిల్ పెడితే జరిమానాలు తప్పవన్నారు. దాని ప్రకారం ఆ రెస్టారెంట్ ముందున్న ప్రాంతం కూడా నో పార్కింగ్ జోన్ కిందకు వస్తుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.